# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-11-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్రమంత్రి వర్గం ఈరోజు సమావేశమైంది.**

**2.** **స్టెమీ- ఎస్టీ-ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్ ఫ్రాక్షన్ గుండెకు భరోసా కార్యక్రమాన్ని ఈరోజు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రారంభించనుంది.**

**3.** **రాష్ట్రంలో నూతనంగా నిర్మించనున్న 14 విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు భూమి పూజ చేయనున్నారు.**

**4.** **కొత్త రేషన్ కార్డులను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**

**5.** **కర్నూలు జిల్లాలోని కప్పట్రాళ్ల అభయారణ్యం ప్రాంతంలో యురేనియం కోసం ఎటువంటి త్రవ్వకాలు జరగడం లేదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశమైంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో భూసేకరణ చట్టం, కొత్త క్రీడా విధానం, డ్రోన్, సెమీకండక్టర్, డేటా సెంటర్ పాలసీల రూపకల్పన, క్రీడాకారులకు ప్రోత్సాహక నగదు పెంపుపై చర్చిస్తున్నారు.

ఇది ఇలా ఉండగా.. రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి అధ్యక్షతన 'సింపుల్ గవర్నమెంట్-ఎఫెక్టివ్ గవర్నెన్స్' అనే అంశంపై ఈరోజు సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వివిధశాఖల కార్యదర్శులు, అధికారులతోపాటు జిల్లాల నుంచి కలెక్టర్లు, ఎస్పీలు, మండలస్థాయి అధికారులు పాల్గొననున్నారు. ప్రజల అర్జీలకు సత్వర పరిష్కారం, ప్రభుత్వ నిర్ణయాల అమల్లో వేగం పెంచడం, ప్రభుత్వ విభాగాల్లో జవాబుదారీతనం తీసుకురావడం తదితర అంశాలపై ఈ సమావేశంలో ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

--------------------------

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ నిర్వహించనున్న స్టెమీ - ఎస్టీ-ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్ ఫ్రాక్షన్ "గుండెకు భరోసా" కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభిస్తారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆసుపత్రులకు

దూరంగా నివసించే ప్రజలు గుండెపోటు వచ్చిన తొలి గంట సమయంలో చికిత్స అందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ఈ విధానంలో చిన్న ఆసుపత్రులను దగ్గరలో ఉన్న పెద్ద ఆసుపత్రులతో అనుసంధానించే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్తృతం చేయనుందని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో 5 వేల 407 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 14 విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణానికి భూమి పూజ చేయడంతో పాటు ఐదు నూతన సబ్‌స్టేషన్లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ప్రారంభించనున్నారని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాజధాని అమరావతి పరిధిలోని తాళ్లాయపాలెంలో రాష్ట్ర ఇంధన రంగంలోనే మొదటి గ్యాస్ ఇన్సులేటెడ్ ఉప కేంద్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వెల్లడించారు. వీటితో పాటు దృశ్య మాధ్యమ విధానంలో మిగిలిన సబ్‌స్టేషన్లకు అక్కడి నుంచే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన నిర్వహిస్తారని పేర్కొన్నారు.

---------------------------

స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో నూతన యాప్‌ని ప్రభుత్వం అందుబాటులోనికి తీసుకువచ్చిందని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ–మెప్మా పథక సంచాలకులు రవికుమార్ తెలిపారు. మెప్మా నూతనంగా తీసుకువచ్చిన ఎస్.హెచ్.జి.ప్రొఫైలింగ్ యాప్ పై ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో స్వయం సహాయ సంఘాలు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఏర్పాటు చేసిన కార్యశాలలో ఈ రోజు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ,

వాయిస్ (30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని అన్ని నగరపాలక సంస్థలకు త్వరలో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా కాకినాడలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులతో నిన్న సమన్వయ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కొన్నిచోట్ల ఉన్న న్యాయపరమైన సమస్యల పరిష్కరించిన అనంతరం ఎన్నికలు ఉంటాయన్నారు. అమరావతి రాజధాని నిర్మాణ పనులు మూడేళ్లలో పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

---------------------------

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన మెగా డిఎస్సీని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో విద్యాశాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వచ్చే ఏడాదికల్లా మండలానికి ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచేలా దృష్టి సారించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

---------------------------

వైయస్సార్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. కడపలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు ఆయన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ

సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో అక్షరాస్యత పెంపు, పేదరిక నిర్మూలన, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. జిల్లాలోని అధికారులు ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలందరికీ చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులను త్వరలోనే పంపిణీ చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో నిన్న నిర్వహించిన సమన్వయ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండే సచివాలయాల సిబ్బంది విధులు నిర్వహించాలని అన్నారు. దీపం-2 పథకానికి ఆధార్ అనుసంధానించే-ఈకేవైసీ సేవలను గ్రామ, వార్డు సచివాలయాల్లోనే త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి వివరించారు.

---------------------------

కర్నూలు జిల్లాలోని కప్పట్రాళ్ల అభయారణ్యం చుట్టుప్రక్కల గ్రామాల్లో యురేనియం లభ్యత, పరిశోధన కోసం ఎటువంటి త్రవ్వకాలు జరగడం లేదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్ని రోజులుగా ప్రజలు యురేనియం త్రవ్వకాలకు వ్యతిరేకంగా చేపడుతున్న నిరసనలు, ఆందోళనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. కప్పట్రాళ్ల అభయారణ్యం పరిసర ప్రాంత ప్రజలు ఎలాంటి వదంతులను, అసత్య ప్రచారాలను నమ్మవద్దని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

---------------------------

విజయవాడ – శ్రీశైలం మధ్య ప్రయోగాత్మకంగా 'స్కై మీట్స్ సీ' పేరుతో చేపట్టనున్న సీ ప్లేన్ ట్రయల్ రన్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 9వ తేదీన ప్రారంభించనున్నారని విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన విజయవాడలోని పున్నమిఘాట్లో నిర్వహించనున్న ఈ కార్యక్రమ ఏర్పాట్లను నిన్న ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పున్నమిఘాట్ పరిసర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు.

---------------------------

విజయవాడ నుంచి శ్రీశైలానికి మధ్య సీ-ప్లేన్ ట్రయల్ రన్ కు సంబంధించిన అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. ట్రయల్ రన్ నిర్వహించనున్న ప్రాంతాన్ని అధికారులతో కలిసి ఆమె నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..

వాయిస్ ( 30 సెకన్లు)

---------------------------

ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించేందుకు ఈరోజు నుంచి ఈ నెల 9 వ తేది వరకు నాలుగు రోజుల పాటు అంతర్జాతీయ నిపుణుల బృందం కార్యశాలను నిర్వహించనుంది. కేంద్ర జలసంఘం ఆధ్వర్యంలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ, రాష్ట్ర జలవనరుల శాఖ ప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి బృంద సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు తెలుసుకోనున్నారు. డ్యాంల

నిర్మాణం, భద్రత, భూభౌగోళిక సాంకేతికత వంటి అంశాలపై అంతర్జాతీయ నిపుణుల బృందం ప్రాజెక్టును పరిశీలించి పలు సూచనలు చేయనుంది.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి డి.శేష సాయి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 30 సెకన్లు....

---------------------------

రాష్ట్రంలో 50 వేలకుపైగా వార్షికాదాయం ఉన్న ఆలయాల్లోని అర్చకులకు కనీస వేతనాన్ని 15 వేలకు పెంచుతున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఈ నిర్ణయంతో మొత్తం 3 వేల 203 మంది అర్చకులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఈ వేతనాన్ని సర్వ శ్రేయో నిధి నుంచి చెల్లించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

======================